

# ది హేండ్ బేగ్

మల్లాది వెంకటకృష్ణమూర్తి

“మీ హేండ్‌బేగ్ బావుంది. ఎక్కడ కొన్నారు?” అడిగాడు గంగాధర్ ఆమెని, సికింద్రాబాద్ స్టేషన్ లోంచి బయటికి నడుస్తూ.

“ఎగ్జిబిషన్‌లో.” చెప్పిందామె నవ్వి.

“చాలా బావుంది. మంచి టేస్ట్ మీది.”

“థాంక్స్.”

"ఏ స్టాల్‌లో ?"

చెప్పిందామె.

కొండచిలువ చర్మంతో చేసిన హేండ్‌బేగ్ అది. చూపరులను ఇట్టే ఆకర్షిస్తుం దా బేగ్, పసుపు పచ్చ రంగులో నిగనిగలాడుతూ.

గంగాధర్ ఆమెని చాలాకాలంనుంచి చూస్తున్నాడు. ఇద్దరూ ప్రతి ఉదయం బొల్లారం స్టేషన్‌లో లోకల్ ఎక్కి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగు తారు. గంగాధర్ నలభై నంబర్ బస్ ఎక్కుతాడు. ఆమె ముప్పై మూడో నంబర్ బస్ ఎక్కడం చాలాసార్లు గమనించాడు. ఒకోసారి సాయంత్రం లోకల్ ట్రెయిన్‌లో కూడా తారసపడు తుందాఅమ్మాయి గంగాధర్‌కి. ఉద్యోగం చేస్తోందనుకున్నాడు.

అందమైన ఆ హేండ్‌బాగ్‌తో ఆమె కనబడగానే, చూపులతో ఏర్పడ్డ పరిచ యాన్ని పురస్కరించుకుని ఆ బేగ్ దొరికేచోటు, దాని ఖరీదు, ఇంకా ఆ అమ్మాయి గురించి అనేక విషయాలు తెలుసుకున్నాడు.

మర్నాడు బొల్లారంలో ఇద్దరూ ఒకే కంపార్ట్‌మెంట్‌లో ఎక్కారు.

"మీ రెక్కడ పనిచేస్తున్నారు ?" అడిగాడు.

"సనత్‌నగర్‌లో."

తను పనిచేసే కంపెనీ పేరు చెప్పింది.

"మీరు ?"

"నాంపల్లిలో."

తను పనిచేసే ఆఫీస్ పేరు చెప్పాడు.

"చాలా దూరం."

"మీదీ చాలా దూరమే. రోజుకి నాలుగుగంటలు వెళ్ళి రావడానికే సరి పోతుంది."

వారం తర్వాత గంగాధర్ చెప్పాడు.

"నిన్న ఎగ్జిబిషన్‌లో కొన్నాను అచ్చం మీ చేతిలో ఉన్నలాంటి హేండ్ బేగ్."

"మీ ఆవిడని తీసుకురండి ఎప్పు డైనా. మా ఇంటి ఎడ్రస్ చెప్పాగా."

"తప్పకుండా ... మీ బస్‌కి ఇంకా పదినిముషాలు టైం వుందిగా. కాఫీ తాగుదాం వస్తారా ?"

"పదండి. మీరు హేండ్‌బేగ్ కొన్న సందర్భంగానా ?" అన్నది ఆ అమ్మాయి నవ్వి.

మరో వారం గడిచాక ఇద్దరిమధ్యా పరిచయం బలపడింది బొల్లారంనుంచి సికింద్రాబాద్ స్టేషన్ చేరుకునేదాకా ఇద్దరూ అనేక విషయాలు – స్వంత విషయాలు కూడా – మాట్లాడుకోవటం పరిపాటి అయిపోయింది వారిద్దరికీ.

*　　*　　*

గంగాధర్ సికింద్రాబాద్‌స్టేషన్‌దగ్గర వున్న బొల్లారం వెళ్ళే బస్‌స్టాప్‌దగ్గరికి చేరుకున్నాడు శనివారం. సికింద్రా

బాద్ స్టేషన్ దగ్గరవున్న ఓ హాల్లో సినిమా చూడటానికి మేట్నీకి వచ్చింది గంగాధర్ భార్య.

ఇద్దరూ సాయంత్రం బస్‌స్టాప్ దగ్గర కలుసుకుని, అక్కడినుంచి ఇంటికి బస్‌లోనో, లోకల్ లోనో వెళ్ళాలని ఉదయమే నిర్ణయించు కున్నారు. అందుకని గంగాధర్ ఆఫీసు వదలగానే సరాసరి సికింద్రాబాద్ స్టేషన్ చేరుకున్నాడు త్వరగా భార్య ఎదురు చూస్తూంటుందని.

దూరంనుంచే చూసాడు భార్యని.

ఒక్కతే వుంది. పక్కన నిలబడ్డ పాతికేళ్ళ యువకుడితో ఏదో చెప్తోంది. అతను మళ్ళీ ఏదో అంటున్నాడు. టెరీకాటన్ బట్టల్లో హుందాగా వున్నా డతను.

గంగాధర్ భార్యదగ్గరికి వెళ్ళి, లోకల్ కుళ్దామని పిలుచుకు వెళ్ళాడు స్టేషన్‌లోకి ఆదరాబాదరాగా.

లోకల్ సరిగ్గా టైముకి వచ్చింది. అక్కడ అడిగాడు గంగాధర్ బస్‌స్టాప్ లోని ఆ వ్యక్తి ఎవరని.

"ఏమో, నాకే తెలియదు."

"మరయితే ఏం మాట్లాడుకుంటు న్నారు మీరు ?"

"నా హేండ్‌బేగ్ చూసి పలక రించాడు. బావుందని, ఎంతకు కొన్నా రనీ, ఎక్కడ కొన్నారనీ అడిగాడు. చెప్పాను. తన పేరు, ఉద్యోగం ఇలా ఏవో చెప్తూంటే, ఇంతలో మీ రొచ్చారు."

రైలు దిగి ఇంటికి వెళ్ళాక గంగా ధర్, తన భార్య హేండ్‌బేగ్‌లోని వస్తువులను టేబిల్‌మీద కుమ్మరించి, దాన్ని బీరువాలో వుంచాడు ఓసారి దానివంక చూసాడు. కొండచిలువ చర్మంతో తయారుచేయబడ్డ ఆ బేగ్ ఏదో జ్ఞానోదయం కలిగించినట్లుగా నవ్వుకున్నాడు మృదువుగా. తలుపు మూసి, టేబిల్‌మీద వస్తువులను తన భార్య పాత హేండ్‌బేగ్‌లోకి మార్చాడు.

సనత్‌నగర్‌లో పనిచేసే "ఆ అమ్మాయి"తో మర్నాడు అనుకున్న విధంగా ఫస్ట్‌షో సినిమాకి వెళ్ళాడు కూడా.

గంగాధర్, భార్యకి ఆ 'కొండ చిలువ చర్మం హేండ్‌బేగ్' మళ్ళీ వాడే అవకాశం ఎన్నడూ రానివ్వలేదు. గంగాధర్ 'ఆ అమ్మాయి'తో సినిమా లకి నెల కోసారి వెళ్తూనే వున్నాడు.